# పేరు మీరే పెట్టండి

**అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.**

'లతా' లోపలికి అడుగు పెడుతూనే ఓ పెద్ద కేక పెట్టాడు మూర్తి.

ఆ సింహగర్జనకి ఎక్కడో వంటగదిలో పని చేసుకొంటున్న లత గుండెలదిరి పోయాయి వస్తూనే భర్త అంత కోపంగా ఉన్నాడేమిటా అని భయపడుతూ పనిచేసుకొంటు పైకి దోపుకొన్న చీరను గభాల్న క్రిందకు లాక్కుని ఒక్క అంగతో ముందు హాల్లోకొచ్చిపడింది.

''పని అయ్యిపోయిందా తొందరగా టాయ్‌లెట్ అవ్వు'' అంటూనే గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకొని లుంగీ కట్టుకొని బాత్ రూంలో దూరాడు మూర్తి.

ఆవేశం వచ్చినా పట్టలేం, ఆనందం కల్గినా పట్టలేం అనుకుంటూ అసలుసంగతేమిటో తెలియక అట్లాగే ఉండిపోయింది లత.

''ఏమిటి నువ్వింకా అలానే ఉన్నావు త్వరగా తయారవ్వు'' హడావుడిపెట్టాడు. ఏ పిక్చర్ ప్రోగ్రామో పెట్టుకొచ్చారు ముందుగా చెపితే ఇంత కంగారు ఉండదు కదా అనుకొంటూ డ్రెస్ మార్చుకొచ్చేసరికి మూర్తి రెడీగా ఉన్నాడు. ఆమె తాళం తీసుకొని ఇంటికి వేసేంతలోనే అతను దారిన పోయే రిక్షా మాట్లాడేశాడు.

రిక్షా బందరు రోడ్డునుంచి పోతుంటే వెంకటేశ్వర థియేటర్‌కి కాబోలు రాత్రే అన్నారు అందులో ఏదో మంచి మూవీ ఆడుతోందని అనుకొంది. కానీ రిక్షా వెంకటేశ్వర థియేటర్ దాటి రేడియో స్టేషన్ దగ్గరకెళ్ళేటప్పటికి కోవెలసందులో ఉంటున్న చెల్లెలిగారింటికేమో దాని ఒంట్లో ఎలా ఉందో జ్వరంగా ఉందట తగ్గిందో, లేదో ఒకవేళ మరిదిగారుగాని రమ్మని ఫోన్ చేశారేమో... ఇలా సాగాయి ఆమె ఆలోచనలు.

అంతలోనే రిక్షా వెంకటేశ్వరస్వామి గుడిముందు ఆగింది. మూర్తి దిగటమే రిక్షావాడికి డబ్బులిచ్చి కొబ్బరకాయ, పూలు పట్టుకొచ్చి 'రా' అంటూ గుడిలోపలికి వెళుతున్న భర్తని అనుసరించింది అయోమయంగా.

'ఏమిటి ఇప్పుడు చెప్పండి' గుడిలోంచి బయటికి వచ్చిన తరువాత ప్రసాదం పెడుతున్న భర్తని అడిగింది లత.

''విగ్రహారాధన మీద వ్యతిరేకంగా పోయిన నెలలో నేను రాయలా ఆ కథ పత్రికలో పడింది రెమ్యూనరేషన్ కూడా పంపారు. నా కథ పత్రికలో పడితే వెంకటేశ్వరస్వామికి కొబ్బరకాయ కొడతానని మ్రొక్కుకొన్నాను.''

''అదా అసలు సంగతి'' తెల్లమొహం వేసిందా... ''అదా అసలు సంగతి'' దిమ్మెరపోయింది లత.

**—టి. సుహాసిని**
ఇం. నెం. F/58
లబ్బీపేట,
విజయవాడ-10

స్రవంతి నెం: 25లో ఈశీర్షికలో
ప్రచురించిన కథకి రచయిత
శ్రీ బి.యల్. నారాయణ
పెట్టిన పేరు: పాపంఅమాయకరావు

ఈవారం ఈ శీర్షికలో కథల
ఎన్నికల గెస్ట్ ఎడిటర్ :
శ్రీమతి మన్నెం శారద



కథలు రాసింది ఎవరా అని చూడకుండా కథల్ని నిష్పక్షపాతంగా చదివాను. వచ్చిన కథల్లో తొంభయి శాతం అమ్మాయి పెళ్ళికి ముందు తప్పు చేయడం వలనో, పెళ్ళయి వైధవ్యం ప్రాప్తించి గర్భవతి కావడం మరో వ్యక్తి ఆదర్శంగా ఆమెని చేపట్టి, ఆమె బిడ్డని మాత్రం మామగారికి అప్పజెప్పడాన్ని ఆధారం చేసి రాసినవి. నాకు నచ్చని మరో విషయం కడుపున పుట్టిన బిడ్డ కోసం ఎంతటి త్యాగాన్నయినా చేయగల స్త్రీ మూర్తి స్వార్థపరురాలయి బిడ్డని వదలి భర్తకి ప్రాధాన్యత ఇవ్వడం! ఆలోచనా విధానంలో నూతనత్వం వున్న రెండు కథలు నన్ను ఆకర్షించేయి. రచయితలు కొంత శైలిని కూడ సర్దుకోగల్గితే ఇంకా మంచి కథలు రాయగలరని నమ్ముతున్నాను. వారికి నా అభినందనలు.

శ్రీమతి మన్నెం శారద అనేక వార పత్రికలకి సీరియల్స్ రాసిన రచయిత్రి. కొన్నిటికి ప్రథమ, ద్వితీయ బహుమతులు కూడా గెలుచుకున్నారు. హైద్రాబాద్ చీఫ్ ఇంజనీర్స్ ఆఫీస్‌లో వుద్యోగం చేస్తూ రచనా వ్యాసాంగంలో చురుగ్గా పాల్గొంటున్నారు.

# "తల్లి మనసు"

రిక్షా దిగి లోనికి వస్తున్న ఆనంద్‌ను చూడగానే- ''అమ్మాయ్! అల్లుడుగారొస్తున్నారు'' అంటూ కేకేసాడు పరంధామయ్య. ఆ మాట వింటూనే ఆనందంగా వాకిట్లోకి పరుగెత్తుకు వచ్చింది జయలక్ష్మి. ''కులాసానా బాబూ.'' అంటున్న మామగారి పలకరింపుకు ముక్తసరిగా బదులిచ్చి వరండాలోవున్న కుర్చీలో కూర్చున్నాడు ఆనంద్. భర్తను కళ్ళతోనే పలకరించి కాఫీ తీసుకురావటానికి లోనికెళ్ళింది జయలక్ష్మి.

''చెప్పండి! ఎందుకు నన్ను ఉన్నపళాన రమ్మని కబురంపారు?'' మామగారిని చూస్తూ అడిగాడు ఆనంద్.

''చెప్పడానికేముంది ఆనంద్! అమ్మాయి పుట్టింటికి వచ్చి ఆర్నెల్లపైనే అయింది. ఎప్పుడెప్పుడు నువ్వు వచ్చి తీసికెళతావని ఎదురు చూస్తున్నాం కాని నీకు అలాంటి ఉద్దేశం వున్నట్లు కనిపించడంలేదు. ఇదేమన్నా బాగుందా? లోకం ఏమనుకుంటుంది! అమ్మాయి చేసిన తప్పేమిటి?'' పరంధామయ్య గొంతులో ఆవేదన!

''ఇందులో తప్పొప్పుల ప్రసక్తిలేదు మామగారూ! గతంలో మీకు ఎన్నోసార్లు చెప్పాను. జయను భార్యగా ప్రేమించగలనుకాని, ఆమె బిడ్డకు తండ్రిగా నేను ఉండలేను. జయ కొడుకు బాధ్యత మీరు తీసుకుంటానంటే జయను తీసికెళ్ళడానికి నేనెప్పుడూ సిద్ధమే.'' మామగారితో చెప్పాడు ఆనంద్ తన నిర్ణయాన్ని.

''అన్నీ తెలిసి పెళ్ళిచేసుకుని ఇప్పుడిలా మాట్లాడటం బాగులేదు ఆనంద్! పెళ్ళయిన రెండేళ్ళకే భర్తను కోల్పోయి బిడ్డతో శోకదేవతలా మిగిలిపోయిన నా కూతురిని మళ్ళీ పెళ్ళి చేసుకుంటానని నువ్వు ఆనాడు ముందుకొచ్చినప్పుడు నిన్ను చూసి, నీ ఆదర్శభావాలను

చూసి మురిసిపోయాను. నా కూతురి జీవితంలో వెలుగురేఖలను చిందించటానికి వచ్చిన పరమాత్ముడిగా నిన్ను తలపోసాను. చుట్టుపక్కల వాళ్ళు ఎద్దేవా చేసినా, నా కూతురి భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని ఎవరినీ లెక్కచేయక నీకిచ్చి పెళ్ళిచేసాను. తండ్రిలేని ఆ పసిగుడ్డుకు తండ్రివి లభించావని పొంగిపోయాను. కాని ఇప్పుడు ఆ బిడ్డ నీకు శత్రువు కావడం, వాడిని జయ నుండి దూరం చేస్తేకాని జయను కాపురానికి తీసికెళ్ళననడం చూస్తుంటే ఏమనుకోవాలో, ఏంచేయాలో అర్థంకావటంలేదు.'' మనసులోని బాధను వెళ్ళగక్కాడు పరంధామయ్య.

పరంధామయ్య మాటలతో ఆనంద్ ముఖం తెల్లగా పాలిపోయింది. వెంటనే సర్దుకుని- ''మామగారూ! చిన్నప్పటినుంచీ ఆదర్శభావాలతో పెరిగిన వ్యక్తిని నేను. ఎంతో కట్నంతో పిల్లనిస్తామని ఎందరో ముందుకొచ్చినా, నేను నమ్మిన ఆదర్శానికి కట్టుబడి, ఒక విధివంచితురాలికి న్యాయం చేకూర్చాలని తలపోసి జయను పెళ్ళిచేసుకున్నాను. అప్పటికే ఆమె ఒకబిడ్డకు తల్లి అని నాకు తెలుసు. జయను చేరదీసినట్లుగానే ఆమె బిడ్డనుకూడా ప్రేమించగలనని తలపోయాను. కాని వాస్తవంలో అది కష్టమని తెలిసిపోయింది. నా మనసులో ఏదో ఫీలింగ్! ఒక రకమైన గిల్టీ కాన్షన్! ఎవరికో పుట్టిన బిడ్డకు నేను కేర్‌టేకర్‌గా ఉంటున్నాననే న్యూనతాభావం నా మనసులో ప్రవేశించి నాకు మనశ్శాంతి కరువుచేయసాగింది. దానికితోడు జయ పొద్దస్తమానం ఆ బిడ్డ ఆలనపాలనతో గడపడం చూస్తుంటే ఆమె ప్రేమంతా మొదటి భర్తకే చెందుతుందనే అసూయ, నా సరదాలకు సంతోషానికి ఆ పిల్లవాడు అడ్డు అవుతున్నాడనే కసి ఇవన్నీ కలిసి ఆ బిడ్డ నాకు శత్రువు అనే భావం నాలో రెట్టింపుచేసాయి. ఈ ఆలోచనా ధోరణి తప్పని. సంస్కారహీనం అని నా హృదయానికి తెలుస్తూవుంది. కాని మనసులో పెనుభూతమై కూర్చున్న ఈ భావంతో స్థిరంగా వుండలేకపోతున్నాను. అందుకే ఈ నిర్ణయానికి రాక తప్పలేదు.'' అన్నాడు ఆనంద్!

కాఫీ కప్పు తీసుకొచ్చి భర్తకు అందించింది జయలక్ష్మి! తండ్రికీ, భర్తకు జరుగుతున్న వాదోపవాదాలు ఆమె వింటూనేవుంది. అతికష్టం మీద గొంతుపెగుల్చుకొని భర్తతో అన్నది—

''చూడండి! మనసులో భావాలు దాచుకోకుండా నిజాయితీగా చెప్పారు. కాని నా బాధను కూడ అర్థం చేసుకోండి. ఇటీవలనే నేను మీకు నేను దగ్గరయింది. అలాంటిమీరే నా ఎడబాటును సహించలేకపోతున్నారే. ఈ బిడ్డను తొమ్మిది నెలలు మోసి కని పెంచిన నేను వాడిని వదులుకోవాలని ఎలా శాసిస్తున్నారు? పేగు తెంచుకొని పుట్టిన బిడ్డను నా స్వార్థంకోసం, సంసారం కోసం వదిలేసుకొని వస్తే నేను కన్నతల్లినే కాదు. రాక్షసిని. వాణ్ని నాదగ్గరనుండి దూరం చెయ్యకండి. మీ కాళ్ళు పట్టుకుని ప్రతిమాలుతాను'' అంటూ భర్త కాళ్ళదగ్గర కూలబడి వెక్కి వెక్కి ఏడ్వసాగింది జయలక్ష్మి.

ఆమె మాటలు, కన్నీళ్ళు ఆనంద్ మనసులో మెల్లగా పరివర్తన తీసుకురాసాగాయి. ఇంత కాలం తనెంత మూర్ఖంగా అతనికి బోధపడసాగింది. పశ్చాత్తాపం అతనిలో చోటుచేసుకుంది. జయలక్ష్మి భుజాలు పట్టి లేవనెత్తుతూ- ''నన్ను క్షమించు జయా!'' అన్నాడు ఆనంద్! తల్లి మనసు గొప్పదనం అతనికి అర్థమయింది.

పరంధామయ్య కళ్ళు ఆనందంతో మెరిశాయి!

**—ఇ. టి. రామారావు**

పర్చేస్ అసిస్టెంట్
ఇండియన్ స్పేస్ రీసెర్చి ఆర్గనైజేషన్,
శ్రీహరికోట-524124

## ప్రవంతి నెం. 23లో ఇచ్చిన

''జయి కొడుకు బాధ్యత మీరు తీసుకుంటానంటే జయను తీసికెళ్ళడానికి నేనెప్పుడూ సిద్ధమే'' మామగారితో చెప్పాడు ఆనంద్ తన నిర్ణయాన్ని.

## వాక్యం ఆధారంగా రాసిన కథలు

# మారని నిర్ణయం

అకస్మాత్తుగా వచ్చిన ఆనంద్‌ని చూసి అవాక్కయిపోయాడు ముకుందు ఒకసారి కింద నుంచి పైదాకా చూసి.

''ఆనంద్ నువ్వా!!'' అన్నాడు ఆశ్చర్యంగా ...డ్ని చూసి.

''అవును నేనే మాంగారూ! అక్షరాలా నేనే ...గారుపడాల్సి అవసరం లేదు. ఆనాడు ...చ్చిన టెలిగ్రాం ఏక్సిడెంట్ వరకూ కరక్టే కాని ఎక్స్‌పైర్ అన్నదే అబద్ధపు వార్త. అన్ని వేల మంది ఏక్సిడెంట్‌లో చనిపోవడం వలన నన్ను కూడా ఆ లిస్టులో కలిపేశారు. ఇకపోతే నేను క్రితం నెల వరకూ ఎవరినీ వాసిని గుర్తుపట్టే స్థితిలో లేను. క్రితం నెలే ఒక అంతర్జాతీయ హిప్నాటిస్టు వచ్చి నాకు బాగు చేసాడు. నౌ ఆయామ్ ఆల్ రైట్'' అంటూ హుషారుగా చెప్పుకుపోతూ ''అవునూ ఇంతకీ జయ ఏం చేస్తుంది'' అంటూ ఒంట గది వైపు చూసాడు.

''ఏం బాగు బాబు నువ్వు వచ్చే లోపల జరగవలసినవన్నీ జరిగిపోయాయి అన్నీ జరిగిపోయాయిబాబు!'' అని నొక్కి చెబుతూ కన్నీటి నాపే ప్రయత్నంలో రెప్పలు టపటపకొట్టాడు ముకుందం.

''ఆనంద్ రాకని గమనించని జయ అప్పుడే బాబు నెత్తుకుని పైకొచ్చి ఆనంద్‌ని చూసి మరలా వెంటనే ఏడుచుకుంటూ పరిగెత్తుపోయింది లోనికి.

జయా! జయా! అనుకొంటూఆనంద్ ఆవెంట ముకుందం లోనికెళ్ళారు.

* * *

''ఇది మాయింటి పరిస్థితి నీ వుద్దేశం ఏమిటి ఆనంద్'' ఆశగా అడిగాడు ముకుందం తన కూతుర్ని మరలా కట్టబెట్టే ప్రయత్నంలో.

''మీరా విషయంలో సంశయపడవద్దు జయ కొడుకు బాధ్యత మీరు తీసుకుంటానంటేజయను తీసుకెళ్ళడానికి నేనెప్పుడూ సిద్ధమే'' మామగారితో చెప్పాడు ఆనంద్ తన నిర్ణయాన్ని.

''బాబు ఆనంద్ నువ్వేమి అనుకోకపోతే....''

ముకుందాన్ని మధ్యలోనే ఆపుచేస్తూ ''ఏమిటి జయనొక్కమాట అడగాలంటారు అంతేనా!'' అడిగాడు ఆనంద్.

''నా మనస్సులోని మాట కరెక్టు చెప్పావయ్యా. అమ్మాయ్ జయా! ఒక్కసారి ఇలా రామ్మా—

''నాన్నగారూ! మీరు మాట్లాడుకొన్న విషయాలన్ని విన్నాను. ఇంక మీరు నన్ను అడగవలసిందేమీ లేదు. ఎన్నిసార్లు అడిగినా నా నిర్ణయం ఒక్కటే. ఒకసారి ఆనంద్‌ని మరిచి మరొక్కరిని పెళ్ళి చేసుకోమన్నారు అప్పుడే నేను ఒక నిర్ణయం తీసుకున్నాను. వున్న బాబుతో గౌరవంగా జీవించగలను. ఒకవేళ అనుకోని పరిస్థితిలో మరలా ఈసారి ఏక్సిడెంట్ జరిగి ఆనంద్ నిజంగా మరణిస్తే మీరు మళ్ళీ ఇంకో పెళ్ళికి సిద్ధపడకుండా వుండరని నేను అనుకోను. అస్తమానం ఆడించటానికి నేను ఆటబొమ్మను కాను. ఇంక నా నిర్ణయం మారదు'' ఖచ్చితంగా చెప్పి అక్కడి నుంచే తలుపేసి వెళ్ళిపోయింది విజయి.

మరునాడు దుబాయ్ ప్లేన్‌లో ఒంటరిగా వెళ్ళాడానంద్.

**—లక్కోజు శ్రీనివాసరావు**

(ప్రదీప్ నగర్, విజయనగం-531211)

## ఒకథ రాయండి

ఈక్రింది ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడైనా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథరాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయల పారితోషికం పంపబడుతుంది.

*''గతాన్ని గుర్తుంచుకుని నాజీవితంతో ఆటలాడితే ఇక్కడ నాశనమయ్యేది నీభర్తకాదు, నీకూతురన్న విషయం మర్చిపోకు''ఫోన్‌లో రాగిణితో చెప్పాడురంగబాబు.*